క్లుప్తంగా

ఘనంగా అడవిరాజులబాబు పండగ



రాజులబాబు వనానికి తరలివెళ్తున్న భక్తులు

నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధిలోని నర్సీపట్నం, బలిఘట్టం, పెదబొడ్డేపల్లికి చెందిన ప్రజలు సోమవారం అడవిరాజులబాబు పండగను ఘనంగా జరుపుకొన్నారు. రాజులబాబుకు మొక్కులు చెల్లించుకునేందుకు కోళ్లు, నైవేద్యాలతో భక్తులకు రాజులబాబు వనానికి డప్పు వాయిద్యాలతో తరలివెళ్లారు. బలిఘట్టం ఉత్తరవాహిని, పెదబొడ్డేపల్లి మున్సిపల్ కార్యాలయం, బలిఘట్టం రాజులబాబు వనం భక్తులతో సందడిగా మారింది.

ఆలయంలో తాగునీటి సదుపాయానికి విరాళం



ఆలయానికి విరాళం అందజేస్తున్న దామోదరరావు దంపతులు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు మోదమాంబ ఆలయానికి తాగునీరు ఏర్పాటు కోసం దాతలు విరాళం అందజేశారు. విశాఖ సమీపంలో గల తాటిచెట్లపాలేనికి చెందిన చిరుకూరు దామోదరరావు, మణి వారి కుమారుడు రోహిత్‌కుమార్, కుమార్తె జయశ్రీ పదివేల రూపాయలు ఆర్థిక సాయం సోమవారం ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి



కె.జె.పురంలో క్లాప్ మిత్రలతో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి నవీన్‌దొర

మాడుగుల రూరల్: చెత్త నుంచి సంపద కేంద్రం ద్వారా గ్రామ పంచాయతీకి ఆదనపు ఆదాయం లభిస్తుందని, కె.జె.పురం గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.నవీన్‌దొర అన్నారు. గ్రామంలో సోమవారం క్లాప్ మిత్రలతో కలిసి గ్రామస్తులకు తడిపొడి చెత్త వల్ల లాభాల గురించి అవగాహన కల్పించారు. గ్రామంలో ఆరుబయట మలమూత్ర విసర్జన నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వి.సంతపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యంతో ప్రజల చెంతకే మెరుగైన వైద్యం అందనున్నట్టు లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. వి.సంతపాలెం గ్రామంలో సోమవారం వైద్య సేవలు అందించారు. 129 మందికి సాధారణ వైద్యంతో పాటు ఆరుగురు గర్భిణులను తనిఖీ చేసి మందులు అందించారు. గర్భిణులు ఆకుకూరలు, పప్పు దినుసులతో కూడిన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చని సూచించారు. పీహెచ్‌ఎన్ ప్రమీలా, హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్, ఎంఎల్‌హెచ్‌పీ మంగ, ఏఎన్‌ఎం పద్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పాఠశాల భవనం



వాడుకలో లేక శిథిలావస్థకు చేరిన భవనం

కె.కోటపాడు : డి.అగ్రహారం గ్రామంలో పూర్వపు పాఠశాల భవనం నిరుపయోగంగా మారింది. గతంలో ఈ భవనంలోనే ప్రాథమిక పాఠశాలను కొనసాగించేవారు. భవనానికి చిన్నపాటి మరమ్మతులు ఏర్పడడంతో నూతనంగా సర్వశిక్షా అభియాన్ నిధులతో నిర్మించిన తరగతి భవనంలోకి పాఠశాలను మార్చారు. అయితే ఈ పాత తరగతి భవనానికి అధికారులు మరమ్మతులు నిర్వహించకపోవడంతో భవనం నానాటికీ బలహీనపడింది. స్లాబ్ వెంట పెచ్చులు రాలిపడుతున్నాయి. భవనాన్ని బాగు చేసి గ్రామస్థాయిలో ప్రభుత్వ శాఖల నిర్వహణకు ఉపయోగించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వెదురుపల్లి కొండపై శివపరమేశ్వర్లు

మహా శివరాత్రి

ఆలయాల ముస్తాబు

- ఆలయాల్లో రేపు తెల్లవారుజాము నుంచి అభిషేకాలు
- రాత్రికి లింగోద్భవ మహన్యాస రుద్రాభిషేకం
- కె.జె.పురం శివాలయంలో సాయంత్రం నుంచి భక్తులకు చద్ది కార్యక్రమం
- ఉత్సవాల సందర్భంగా కబడ్డీ పోటీలు



శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేస్తున్న వి.వి. అగ్రహారం శివాలయం



ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి వారు

మాడుగుల రూరల్ : మహాశివరాత్రి పర్వదినానికి మండలంలో అన్ని శైవక్షేత్రాలను ముస్తాబు చేసారు. శివరాత్రి పర్వదినాన కె.జె.పురం ఉమాభీమలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం తెల్లవారుజాము నుంచి పూజలు, అభిషేకాలు, ప్రసాద వితరణ జరుపుతారు. భక్తులకు టోకెన్లు అందజేసి, డ్రా ద్వారా చీరలు అందజేస్తారు. సాయంత్రం నుంచి స్వామి వారి ఊరేగింపు, కోలాటంతో పాటు శివనామస్మరణ, ఆలయంలో యల్లపు పెంటయ్య మాస్టర్ సహకారంతో 3000 దీపాలతో దీపార్చన కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులకు చద్ది కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. రాత్రికి కబడ్డీ పోటీలు, టగ్ ఆఫ్ వార్, స్కిప్పింగ్, మ్యూజికల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ వారు తెలిపారు. రాత్రి పది గంటలకు మహన్యాస రుద్రాభిషేకం నిర్వహిస్తున్నారు. వీరవల్లి అగ్రహారం ఉమాభీమలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు వచ్చే నెల 1 వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ వారు తెలిపారు. ఎం.కోడూరు శివాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం స్వామి వారి కల్యాణం, అనంతరం కల్యాణంలో పాల్గొనే దంపతులకు అన్నసమారాధన ఉంటాయన్నారు. సాయం పూజలు, రాత్రి మహన్యాస రుద్రాభిషేకం నిర్వహిస్తారు. మండలంలో దబ్బకుంటు రహదారి పక్కన పంట పొలాల్లో గల పార్వతీ సమేత ఉమా భీమ లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. జంపెన స్వర్గలింగేశ్వర ఆలయంతో పాటు పిట్టగెడ్డ, విజెపురం, వీరనారాయణంలో గల గౌరీశ్వర ఆలయంలో మహ శివరాత్రి ఉత్సవాలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గల మహంకాళ్వేశ్వరుడు, వీరవల్లి అగ్రహారం పెట్రోల్ బంకు వద్ద గల శివాలయంలోనూ పూజలు, అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తారు. మాడుగుల పాలగెడ్డ వద్ద గల ఉబ్బలింగేశ్వర స్వామి, స్వర్గలింగేశ్వర, ఉమా భీమేశ్వర ఆలయాలను శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేశారు.



ప్రత్యేక అలంకరణలో ఉమా భీమలింగేశ్వర స్వామి



మాడుగుల పార్థస్వామి ఆలయం వద్ద స్వర్గలింగేశ్వరుడు



వీవీ అగ్రహారంలోని శివలింగం

చోడవరం : స్వయంభూ గౌరీశ్వర స్వామి కల్యాణ మహాశివరాత్రి ఉత్సవాలు ఈనెల సోమవారం నుంచి ప్రారంభ మయ్యాయి. ఈ ఉత్సవాలు మార్చి 1వతేదీ వరకూ జరుగుతాయి. ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. సినీ, నాటక రంగ ప్రముఖులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలతో స్వామివారి కల్యాణోత్సవ వేడుకలు ప్రారంభించారు. పరిసర ప్రాంగణంతో పాటు మెయిన్‌రోడ్డు నుంచి ఆలయం వరకు దారిపొడవునా విద్యుదలంకరణ చేశారు. దేవదాయ ధర్మదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యానారాయణమూర్తి, ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతి పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 26వ తేదీన శివరాత్రి పర్వదినం కావడంతో మంగళవారం నుంచి భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. వారంరోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో రోజుకో సాంస్కృతిక కార్యక్రమం ప్రదర్శించనున్నారు. ఉత్సవాల ముగింపు రోజున ప్రముఖ సినీ హీరోయిన్ అంజలి రానున్నారు.



విద్యుదలంకరణలో సర్వాంగ సుందరంగా గౌరీశ్వరస్వామి ఆలయం

నాతవరం : మహాశివరాత్రి పండగ సందర్భంగా శివాలయాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. మండలంలో వీవీ అగ్రహారంలో 750 ఏళ్ల క్రితం ప్రతిష్ఠించిన శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసేందుకు దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజుల్లో శివలింగాన్ని బండ్లపై తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠించినట్టుగా ఈ ప్రాంతీయులు చెబుతున్నారు. జిల్లేడుపూడి శ్రీనూకాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో 30 అడుగుల ఎత్తయిన నాగసర్పంతో కూడిన శివలింగం ఏర్పాటు చేశారు. శివరాత్రి సందర్భంగా ఈ చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకుంటారు. వెదురుపల్లి గ్రామంలో రేగటమ్మ కొండపై వెలసిన పార్వతీపరమేశ్వర్ల విగ్రహాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. చిక్కుడుపాలెం గ్రామంలో గల శ్రీ శివశక్తి క్షేత్రంలో భూగర్భ శివాలయంలో శివరాత్రి పూజలకు ఏర్పాట్లు చేశారు. అలాగే సిద్ధిపట్నం, చమ్మచింత, సరుగుడు, మర్రిపాలెం, ఎం.బి.పట్నం, నాతవరం గ్రామాల్లో గల శివాలయాలు కూడా శివరాత్రి పర్వదినానికి ముస్తాబయ్యాయి. సరుగుడు జలపాతం వద్ద శివలింగం శివపార్వతులు విగ్రహాలను పండగ సందర్భంగా ముస్తాబు చేస్తున్నారు. సరుగుడు సుందరకోట పంచాయతీలు శివారు 16 గ్రామాల గిరిజనులు మహాశివరాత్రి పండగను ఘనంగా జరుపుకొంటారు. ఈ మేరకు జలపాతం వద్ద ఉన్న శివలింగం, పార్వతీ పరమేశ్వర్లను ప్రత్యేక అలంకరణ చేశారు.



మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేసిన కె.జె.పురం శివాలయం



జిల్లేడుపూడిలో ఎత్తయిన నాగసర్పంతో కూడిన శివలింగం



పురాతన శివాలయం

ఘనంగా ఏర్పాట్లు

కె.జె.పురం ఉమా భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రతి ఏటా వలే ఈ ఏడాది కూడా తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, సాయంత్రం స్వామి వారి ఊరేగింపు కోలాటం కార్యక్రమం నడుమ ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. రాత్రి 10 గంటల నుంచి మహన్యాస రుద్రాభిషేకం, భక్తులకు అపరిమితంగా చద్ది కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు.

–హెచ్‌బి సత్యనారాయణమూర్తి, ఆలయ ప్రధాన ఆర్చకుడు, కె.జె.పురం శివాలయం

గ్రామస్తుల సహకారంతో ఉత్సవాలు

అతి పురాతన శివాలయం అయిన వీరవల్లి అగ్రహారం ఉమా భీమలింగేశ్వర స్వామి ఆలయంలో మార్చి 1వ తేదీ వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. గ్రామస్తుల సహకారంతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నాం.

–సాధువురావు, ఆలయ ప్రధాన అర్చకుడు, వీరవల్లి అగ్రహారం శివాలయం

4న మోదకొండమ్మ తీర్థం

ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ తీర్థ మహోత్సవం వచ్చే నెల 4 వ తేదీన జరగనున్న సందర్భంగా తీర్థం వాల్‌పోస్టర్‌లు సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు మోదకొండమ్మ ఆలయం వద్ద విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, భీమరశెట్టి పైడియ్య నాయుడు, ఢిల్లీ నానాజీ, పల్లెల రాము, నందవరపు రవితేజ, కుప్పిలి భవానీ పాల్గొన్నారు.



తీర్థం వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తదితరులు

రెండు గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు

కె.కోటపాడు : మండలంలో పింద్రంగి, కొరువాడ జగన్నాథపురం గ్రామాల్లో సోమవారం సీతారాముల తీర్థ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. రెండు గ్రామాల్లో గల సీతారాముల ఆలయాల్లో ఆయా గ్రామాల ప్రజలు ఉదయం నుండే పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలను జరిపారు. తీర్థం సందర్భంగా బంధువులు, స్నేహితులు రెండు గ్రామాలకు పెద్ద సంఖ్యలో రావడంతో గ్రామాలు సందడిగా మారాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చీడికాడ శివాలయం వద్ద కల్యాణ రాట



కల్యాణరాట వేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

చీడికాడ : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా చీడికాడ శివాలయం వద్ద సోమవారం ఉదయం కల్యాణరాట వేసినట్టు ప్రధాన పూజారి గరిమెళ్ల ఈశ్వరశర్మ తెలిపారు. మహాశివరాత్రి పర్వదినమైన బుధవారం స్వామివారికి గ్రామంలో పురవీధి సేవ అనంతరం కల్యాణం జరుగుతుందన్నారు.

ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలి

దేవరాపల్లి : ఉపాధి హామీ పథకంలో కూలీలందరికీ పనులు కల్పించాలని ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు సూచించారు. మండలంలోని ముషిడిపల్లి, కెఎం.పాలెం, ఎ.కొత్తపల్లి, చిననందిపల్లి, పెదనందిపల్లి గ్రామాల్లో సోమవారం పర్యటించారు. గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, మస్టర్ల ప్రక్రియతో పాటు సక్రమంగా పేమెంట్లు పడుతున్నాయా లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్, చెత్త సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. స్థానిక అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పౌర సేవలందించడంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఎల్. లింగన్న, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్ పాల్గొన్నారు.



ముషిడిపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో సువర్ణరాజు

‘జ్ఞాన జ్యోతి’తో చిన్నారుల్లో మానసిక వికాసం



కాశీపురంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో ఎంఈవోలు పడాల్‌దాస్, ఉషారాణి



నాతవరంలో శిక్షణ తరగతుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు

దేవరాపల్లి : పూర్వ ప్రాథమిక స్థాయి చిన్నారుల్లో మానసిక, శారీరక వికాసానికి జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు దోహదపడతాయని మండల విద్యాశాఖ అధికారి–1 బి.పడాల్‌దాస్, ఎంఈవో–2 వి.ఉషారాణి అన్నారు. మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతుల్లో భాగంగా ఐదో రోజు సోమవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలను పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న చిన్నారులుగా భావించి స్నాతకోత్సవ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు పడాల్‌దాస్, ఉషారాణి మాట్లాడుతూ నూతన విద్యా విధానం అమలులో భాగంగా బోధన తీరుపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు దశల వారీగా 120 రోజుల పాటు వివిధ అంశాలపై తర్ఫీదునిస్తున్నట్టు తెలిపారు. మొదటి విడత ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగుస్తుందన్నారు. పూర్వ ప్రాథమిక విద్యార్థుల శారీరక, మానసిక, మేధోభివృద్ధి, సామాజిక, భావోద్వేగ, సాంఘిక అభివృద్ధి సాధించే విధంగా డీఆర్పీలు కె.సుభాష్ చంద్ర, కె.సుధాకర్, వి.శ్రీహర్షలు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆదిలక్ష్మి, కల్యాణి పాల్గొన్నారు.

నాతవరం: జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతుల్లో చెప్పిన ప్రతి అంశాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వివరించాలని ఎంఈవో–2కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. స్థానిక హైస్కూల్‌లో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు, ఈసందర్భంగా వరహాలబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా అవలంబించే విద్యా విధానాన్ని అమలు చేసేందుకే ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న ప్రతి విషయాన్ని కార్యకర్తలు క్షేత్రస్థాయిలో బాధ్యతగా అమలు చేయాలన్నారు.

ఎస్‌ఐ రామకృష్ణారావుకు ఎస్పీ ప్రశంసలు



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న రోలుగుంట ఎస్‌ఐ రామకృష్ణారావు

రోలుగుంట : గంజాయి కేసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న నిందితులను పట్టుకోవడంలో రోలుగుంట ఎస్‌ఐ పొన్నాడ రామకృష్ణారావు తనదైన శైలిలో ప్రతిభ చూపారు. ఎస్‌ఐ పనితీరును అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా గుర్తించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన క్రైం మీటింగు అనంతరం ఎస్‌ఐ రామకృష్ణారావుకి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. మరింత సమర్థవంతంగా చట్టాన్ని సంరక్షించడానికి తన సేవలు విస్తృతపరుస్తానన్నారు.

రూ.61 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు లక్ష్యం

నాతవరం : డ్వాక్రా సంఘాలకు ఈ ఏడాది బ్యాంకు లింకేజీ రుణాలు రూ.61 కోట్లు ఇవ్వడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని వెలుగు ఏపీఎం కనకరాజు అన్నారు. మండల కేంద్రంలో గల వెలుగు కార్యాలయంలో సోమవారం మండల మహిళా సమైక్య సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1428 డ్వాక్రా సంఘాలు ఉన్నాయన్నారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి డ్వాక్రా సంఘానికి బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇంతవరకు సకాలంలో రుణాలు చెల్లించే సంఘాలకు రుణాలు ఇచ్చామన్నారు. ఈ మార్చి నాటికి శత శాతం లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు కోరుబిల్లి మణి, సంఘం మండల కోశాధికారి రేగటి దేవి, వెలుగు శాఖ సహాయ అధికారి పరమేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెలుగు ఏపీఏ కనకరాజు

ఘనంగా సిద్ధి వినాయకస్వామి విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం

రోలుగుంట : స్థానిక శ్రీ సిద్ధివినాయక ఆలయంలో సోమవారం స్వామివారి విగ్రహ విగ్రహ ప్రతిష్ఠ 32 వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ వారు ఘనంగా నిర్వహించారు. సోమవారం వేకువజాము నుంచి స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోతల లక్ష్మీశ్రీనివాస్, ఓంశాంతి రమక్క, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాకిరెడ్డి శ్రీను, తమరాన సత్తిబాబు స్వామివారిని దర్శించుకున్నారు.



స్వామివారిని దర్శించుకొంటున్న భక్తులు

జిరాయితీ స్థలంలో పాక తొలగింపుతో ఉద్రిక్తత

గొలుగొండ : పల్లావూరు గ్రామంలో పల్లా చిన్న అనే వ్యక్తి అక్రమంగా ప్రభుత్వ స్థలంలో పాక ఏర్పాటు చేశాడని, దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు సోమవారం సాయంత్రం పాక తొలగించడానికి ప్రయత్నించడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. 2016లో పల్లావూరు గ్రామానికి అనుకొని పల్లా చిన్న అనే వ్యక్తి 10 సెంట్ల స్థలానికి అధికారులు పట్టా ఇవ్వడం జరిగింది. అయితే ఈ స్థలం అక్రమంగా ఆక్రమించి పట్టా చేయించుకోవడం జరిగిందని గ్రామస్తులు పలుసార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. అధికారులు సర్వే చేయించి ఈ స్థలంపై సరైనా సమాధానం చెప్పకపోవడంతో గ్రామస్తులు మూకుమ్మడిగా ఆ పాకను తొలగించారు. దీనిపై పల్లా చిన్న రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు గ్రామస్తులు తీవ్ర నష్టం కలిగించారని ఆరోపిస్తూ బాధితుడు చిన్న డీజిల్ ఒంటిపై పోసుకొనే ప్రయత్నం చేయగా అధికారులు అడ్డుకున్నారు. ఈ విధంగా పాక తొలగింపు చేయడం సరైన పద్ధతి కాదని అధికారులు అన్నారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన కమ్యూనిటీ స్థలాన్ని ఆక్రమించి పాక వేశాడని, దీనికి అధికారులు వత్తాసు పలుకుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. దీనిపై మంగళవారం విచా రణ చేస్తామని అంత వరకు ఎటువంటి పనులు చేయరాదని ఆర్ఐ కొండబాబు, పోలీసులు తెలిపారు.

సర్వేయర్లు లేక ఇబ్బందులు

బుచ్చెయ్యపేట : గ్రామాల్లో పూర్తి స్థాయిలో సర్వేయర్లు లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పది సెంట్ల నుంచి 5 ఎకరాల లోపు గల చిన్న, సన్నకారు రైతులు ఉన్నారు. గతంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభ ల్లో భూ సమస్యల గురించి సదస్సుల్లో దరఖాస్తు చేసుకున్నా అధికారులు స్పందించలేదని సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ కోరుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల సచివాలయ సర్వేయర్లను వేరే సచివాలయానికి బదిలీ చేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఈ సమస్యపై స్పందించాలని ఆయన కోరారు. తురకలపూడి సచివాలయం సర్వేయరు డిప్యూటేషన్ మీద వెళ్లడం వల్ల అక్కడ రైతులు మండల మాజీ వైస్ ఎంపీపీ అప్పలనాయుడు ఆధ్వర్యంలో సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 256 మంది రైతులు సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.



సచివాలయం వద్ద ఆందోళన చేపట్టిన అప్పలనాయుడు తదితరులు